పెద్ద కథ

# చోటు

2వ వారం

## మధురాంతకం నరేంద్ర

"యేంలే! యీ తావు గూడా కనిపెట్టేస్ఛివా? పద పద. నేనూ వస్ఫాండాను యెనకాల్నే!" అంటూ కసురుకున్నాడు వోబులేసు.

వొంటరిగానే వెనుదిరిగివచ్చిన మద్దులేటి తమ ఇంటి ముందు గుమికూడిన జనాన్ని చూడగానే బెంబేలుపడిపోయాడు. తుడుముపైన తోలుపట్టాతో బూదినట్టుగా గుండె డబడబలాడసాగింది. బెరుకు బెరుకుగా యింటిదగ్గరికొచ్చి ముంగిట్లో నిల్చున్నాడు.

పూర్తిగా గుడ్డచుట్టిన పొడవాటి శరీరం ముందు సుబ్బమ్మ గుండెలవిసేలా యేడుస్తోంది.

"యీ ముగ్గురాయి త్రొవ్వేపనికి యీ మాదిరి వాట్లు పనికిరావు.మనవల్లా యిది అయ్యే పని గాదని చెప్తాండానే వుండాను. యినకండా వాట్లు పెట్టేకి పోయినాడు..." శరీరాన్ని మోసుకొచ్చిన వాళ్లలోంచి వొకతను చెబుతున్నాడు. "కొండరాయి మాదిరిగా వొళ్ళంతా పిచ్చలు పిచ్చలయిపోయింది. ఆ గోరం యేల చెప్పావులే! చూడనోడు వున్నాత్మడు. యెవురికీ వాళ్ళు బెదిరిపోయి వచేస్ఛావుంటే పెద్దరెడ్డి గదుముకోని మమల్ని అంపించినాడు. చిల్లాపల్లాలయిన కాయాన్ని వొకచోట జేర్చి మూటగట్టి తెస్ఫాండాము. యిదంతా తెలిసి పోలీసు కేసయితే దానం జేసేకి పీనిగ్గూడా దొరకదు. కేసూ గీసూ గాకుండా చూసుకుంటావని పెద్దరెడ్డి జెప్పినాడు. దానం జేసేకి లెక్కిచ్చినాడు...."

వాళ్ల మాటలేవీ వినబడనట్టుగా సుబ్బమ్మ యేడుస్తూనే వుంది. మద్దులేటికి చెప్పలేనంత దుఃఖం వచ్చింది.

రోడ్లమీద పరచుకుంటూ పరిగెడుతోంది. తెల్లటి మేఘమొకటి సముద్రంకేసి పరతెంచిపోతూ వుండడంతో ఆకాశంలోని చంద్రవంక తన అస్థిత్వాన్ని పోగొట్టుకొంది. దూరంగా పెద్ద పెద్ద భవనాలపైన నిరంతరాయంగా వెలుగుతున్న రంగురంగుల హోర్డింగులు పల్చటి మంచుతెరల్లోంచీ జిలుగు జిలుగు కాంతుల్తో ముద్దముద్దగా కనిపిస్తున్నాయి.

యెటువంటి పరిస్థితిలోనూ యిద్దరు వ్యక్తులు వొక్కసారిగా లోనికెళ్ళడానికి వీల్లేకుండా కట్టిన సన్నటి అంబసీ గేటు దగ్గరినుంచీ క్యూ మొదలైవుంది. వీసా దొరకగానే యిటే పరదేశానికి వెళ్ళిపోవడానికి సన్నద్ధమైనట్టున్న పెద్ద పెద్ద సూట్‌కేసుల పక్కన మూటల్లాగే వుండచుట్టుకుపోయి కనిపిస్తున్నారు అయిదారుమంది వ్యక్తులు. వారిపక్కన రకరకాల శాలువాల్ని ముదరజుట్టుకుని కూర్చున్న సముదాయంలో స్త్రీలెవరో, పురుషులెవరో కనిపెట్టడం కుదరడంలేదు. షిఫ్ట్ డ్యూటీల్లా వంతులవారీగా క్యూలో కూర్చుంటున్న వ్యక్తుల ముఖాలు రాత్రి కడిగిపెట్టిన స్టీలుగిన్నెల్లా వెలిగిపోతున్నాయి. తమ చోటు జారిపోనివ్వకుండా శరీరంలోని యేదో వొక భాగాన్ని క్యూలోకి బదలాయించి పేవ్‌మెంట్ పైన యింకా కొందరు నిద్రతో విన్యాపాలు చేస్తున్నారు. పదిహేను యిరవైనుంచి అరవైవరకు వాళ్ల వయస్సు యెంతయినా వుండొచ్చు. కొందరు తమకు మారుగా తమ వస్తువుల్ని వుంచి దూరంగా వెళ్ళి నిల్చుని మాట్లాడుకుంటూ వుండడంతో అక్కడక్కడా ఖాళీపడిపోయిన క్యూ, అంబసీ అనే లంబాడీ పిల్ల మెడలోంచీ ముక్కలు ముక్కలుగా తెగిపడిన గుండుపూసల దండలా విలక్షణంగా కనిపిస్తోంది.

మద్దులేటి తన చోటికి తిరిగొచ్చేసరికి టీ షర్టు కుర్రాడి పక్కన యిదివరకటి కుర్రాడికి బదులుగా కొంచెం ముదురు వయస్సున్న యువకుడూ, అతడికంటే వొకటి రెండేళ్ళు చిన్నదిగా అనిపిస్తున్న యువతీ కనిపించారు. యేడెనిమిది జేబులున్న బొమ్మల లూజు చొక్కాను నీలిరంగు జీన్సు పాంటులో టక్‌చేసుకున్న ఆ యువకుడి నిగనిగల యెర్రటి శరీరంలో అందమైన ఫ్రేమున్న కళ్ళజోడూ, కొనదేలిన ముక్కుకింది నల్లటి మీసమూ కేంద్ర బిందువుల్లా కనిపిస్తున్నాయి. గోధుమరంగు పంజాబీ డ్రస్సులో సన్నగా పొడుగ్గా యెర్రగా ఆరోగ్యంగా వున్న ఆ యువతి ప్రతిరోజూ చేస్తున్న పనినే మళ్ళీ చేస్తున్నంత యథాలాపంగా పేవ్‌మెంటుపైన కూర్చొనివుంది.

ఆమె చేతుల్లోని ఫైలు తీసుకుని, వొకసారి తిప్పిచూసి "యెమ్‌సియ్యే సర్టిఫికెట్టు తీసుకరాలేదా?" అని అడిగాడతను.

"రిజల్ట్సు అఫీషియల్‌గా డిక్లేర్ చెయ్యలేదు. వచ్చేవారంలోగానీ యిష్యూ చెయ్యరు" పారదర్శకమైన అద్దంలోంచి దూరంగా వున్న వస్తువును దేన్నో చూస్తున్నట్టుగా అతడి ముఖంలోకి చూస్తూ చెప్పింది ఆవిడ.

అయిదారు నిమిషాల తర్వాత 'వెయిల్స్‌కా గ్రే కలర్ బాగా లేదు. రోజ్‌కలర్ ట్రయ్‌చెయ్యి" అన్నాడతను.

అరిచేతుల తమరల్లో ముఖాన్ని దాచుకున్న ఆ అమ్మాయి రెండు నిమిషాల తర్వాత "రేపు ట్రయ్‌చేస్తాను" అంది.

తన జేబులోంచి ఫొటోను అతికించిన చిన్న కార్డును పైకితీసి ఆమె చేతికిచ్చాడతను. ఆమె వోసారి దాన్ని అటు యిటూ తిప్పిచూసి "ఫోన్ నెంబరు నోట్‌చెయ్యలేదే?" అని అడిగింది.

"అది సీక్రెట్. కాన్ఫిడెన్షియల్" అన్నాడతను.

ఇంతలో నల్లటి మోటరుబైకొకటి రెండడుగుల దూరంలో ఆగింది. దాని వెనక కూర్చున్న కుర్రాడు కిందికి దిగి "ఐ విల్ వెయిట్ హియర్.. యూ కెన్ గో" అంటున్నాడు క్యూలోని వ్యక్తితో.

"హలో మూర్తీ... హౌ ఆర్ యూ!" మిలమిల మెరుస్తున్న చూపుల్తో బొమ్మల చొక్కా యువకుడు వుత్సాహంతో మోటర్‌బైకు దగ్గరికి నడిచాడు.

పక్కన కూర్చున్న అమ్మాయిని నేరుగా చూడగల అవకాశం దొరకడంతో మద్దులేటీ, టీ షర్టు కుర్రాడూ పక్కచూపుల్నీ చూస్తూ, అప్పుడప్పుడూ మోటర్‌బైకును కూడా పరామర్శించసాగారు.

"హాయ్ శీమా! యెవ్వడొచ్చినాడిండియాకు?" మూర్తి పలకరించాడు.

"టూ వీక్సయింది. వచ్చే టెన్తే మళ్ళీ వెళ్ళిపోవాల. బైదిబై షీ యీజ్ మై ఫియాన్సీ నీలిమ..."

"హలో! ప్లీస్ టు మీట్ యూ" అంటూ ఆమెను పలకరించాక మూర్తి "నేనిప్పుడు యిక్కడ్నే మదరాసులో వొక ప్రయివేటు ఫర్మ్‌లో వుండాను. యేడు వేలు పే జేస్తారు. యింకో రెండేళ్ళు పోతే కన్సిడరబుల్‌గా పెంచతావని ప్రామిస్ చేస్తావుండాడు యెండీ. కానీ వాకీ అట్మాస్ఫియర్ పడలేదు శీమా! వన్ ఆఫ్ మై కజిన్స్ యీజ్ దేర్ ఇన్ షార్జా.. వచ్చేయమంటా వుండాడు. వచ్చే సమత్సరంలో వెళ్ళిపోదామనుకుంటా వుండాను" అన్నాడు.

"స్టేట్స్‌కు ట్రయ్‌చేయగూడదా?" అంటూ అడ్డుతగిలాడు శీమా.

అతవోసారి వులిక్కిపడ్డట్టుగా తలపైకెత్తి "ఐ డోంట్ హేవ్ సచ్చేన్ అయిడియా! మా నెవ్వ్యూ వీసా కోసరం ట్రయ్‌చేస్తా వుండాడు. యిక్కడ పది




లిపెట్టమంటే వచ్చినాను. కొంచెం అర్జెంటు పనుండాది. పోతాను..." అంటూ మాట్లాడుతూనే వాహనాన్ని డబడబలాడించి ముందుకు దూసుకెళ్ళిపోయాడు.

శీమా మళ్లీ తన చోటుకొచ్చి కూర్చుంటూ "యెంత జెలసీనో చూసివావా? వీడు యింటర్లో నాకు బెంచ్ మేటు" అన్నాడు అటువైపే చూస్తూ.

ముందుకే చూస్తూ తలవూపింది నీలిమ.

"స్టేట్స్‌లో యే యూనివర్సిటీలో వుండారు సార్ మీరు?" కుతూహలాన్ని ఆవుకోలేక అడిగాడు టీషర్టు కుర్రాడు.

"రీసెర్చి కాదండీ! జాబ్ చేస్తావుండాము. యిల్లినోయిస్‌లో కంప్యూటర్ కన్సల్టెన్సీలో జాబ్... యెంటెక్ చేసింది గూడా అడ్నే! నెక్స్ట్ యియర్లో గ్రీన్‌కార్డు కూడా వస్తుంది..." యింత సేపటికి సరైన శ్రోత దొరకడంతో శీమా కూడా వుత్సాహంగా సమాధానం చెప్పాడు.

"పెళ్ళికాకుండానే ఆమెకూ వీసా యిస్తారా సార్ వీళ్ళు?" టీషర్టు కుర్రాడికి మరో అనుమానం వచ్చింది.

శీమా రహస్యం చెబుతున్నట్టుగా అతడికేసి వొంగి "నిజానికి మా పెండ్లి జరగబొయ్యేది యెల్లుండి. తిరపతిలో పెండ్లి. మా బ్రదరూ, వాళ్ల బ్రదరూ ఆ పనుల్తో బిజీగా వుండారు. పొయినసారి యిండియాకు వచ్చినప్పుడే రిజిష్టరాఫీసులో పెండ్లి రిజిష్టరు చెయ్యించి




నాము. ఆ ఫార్మాలిటీస్ అయిపోయి నట్టు ఫారాలు సబ్మిట్‌చేస్తేనే యిక్కడ వీసా యిస్తారు..." అన్నాడు.

కాస్సేపటిదాకా నిర్ఘాంతపడిపోయిన మద్దులేటి బలవంతంగా గొంతు పెగుల్చుకుని "అయితే మీకివ్వడు పెళ్ళయి నట్టా కానట్టా సారూ?" అని అడిగాడు.

అతని ప్రశ్నని వినిపించుకోకుండా నీలిమకేసి తిరిగి "పాపం యీ పెళ్ళి హడావుడంతా మీ అన్న నెత్తిపైన్నే పడింది. హీ యీజ్ రియల్లీ యెఫిషియంట్. వేరే యింకొకరయితే తట్టుకోను మండరు. జాతకాలు చూపించే కాడినుంచీ అన్ని పనులూ వొక చేత్తో చేసుకోనిపోతా వుండాడాయన. యూ ఆర్ రియల్లీ ఫార్చునేట్ టూ హావ్ సచ్చే బ్రదర్" అంటూ దూరంగా స్టీలు ఫ్లాస్కులో కాఫీ తీసుకొస్తున్న వ్యక్తిని చూడగానే "కాఫీ తాగుదామా!" అని అడిగాడు శీనూ.

తాగకెక్కడికి పోతారన్నంత ధీమాతో ఫ్లాస్కును క్యూ మొదటికి తీసుకెళ్ళి ప్రతివొక్కరికీ అడగకపోయినా ప్లాస్టిక్ కప్పులతో కాఫీనందిస్తూ రాసాగాడు కాఫీవాలా.

జెమినీ సర్కిల్ చుట్టూ రోడ్లపైన రకరకాల వాహనాల సంరంభం క్రమంగా పెరిగిపోతోంది. పేవ్‌మెంట్లపైన పాదచారులు కూడా కనిపిస్తున్నారు. దూరంగా తూర్పుదిశలో భవనాల కవతలినుంచీ లేలేత కిరణాలతో యెండను వల్లుకుంటూ ఆకాశంపై కెగబాకుతున్నాడు సూర్యుడు. రాత్రల్లా కప్పుకున్న శాలువాల్లోంచీ ముఖాల్ని బయటదీసి చలిగాచుకుంటున్నవాళ్ళు ఆకుల్లోంచి సగం సగం బయటపడిన కాబేజీ పువ్వుల్లా బిడియంగా కనిపిస్తున్నారు. చలిగాలిని రేపుతూ వాహనమేదయినా రోడ్డుపైన దౌడుతీసినప్పడల్లా మరింతగా ముడుచుకుపోతున్నారు.

పసుపురంగు నీటియేనుగులాంటి ఆటో వొకటి గీపెట్టుకుంటూ వచ్చి ఆగింది. అందులోంచీ యెర్రగా లావుగా పొడుగ్గా వున్న యువకుడూ, సన్నగా పొట్టిగా నల్లగా వున్న యువతీ దిగారు. అంతవరకు మద్దులేటికి అయిదారుమంది కవతల ముసుగు కప్పుకుని కూర్చొనివున్న ఆకారం పొడవాటి గుమ్మటంలా పైకిలేచి "యిక్కడ... యిక్కడ" అంటూ కేకేసింది.

ఇంకా మగతనిద్రలో తూగుతున్నవాళ్ళు యేదో జరిగిపోయిందనుకుంటూ వులిక్కిపడి కళ్ళు తెరచి చూడసాగారు.

"యిక్కడ.. యిక్కడే.. కమాన్ డియర్" అంటూ ఆ యువకుడు ఆమె కేకకు ప్రతిధ్వనిలా కేకలేస్తూ తనతోబాటూ వచ్చిన యువతిని ఆహ్వానించాడు.

"కమాన్ సుష్మా.. నువ్విలా కూర్చో! నేనిలా నిల్చుంటాలే! రేయ్ బాబీ! అక్కడ కాఫీలేవో అమ్ముతున్నట్టున్నారు. వెళ్ళి మీ ఆవిడకో కప్పు తెచ్చిపెట్టు" అంది లావాటి ఆవిడ.

"వియ్ హావ్ ఆల్రెడీ హాడ్ యిట్. బాబీ వెళ్ళి మీ అక్కయ్యకు కాఫీ తెచ్చివ్వు. పాపం, మనకోసం రాత్రి నుంచీ యీ క్యూలో వెయిట్ చేస్తుంటారు.." అంది సుష్మ.

"అవునమ్మాయ్! నిన్న మీ ఫోన్ వచ్చిన వెంటనే బయల్దేరి సాయంకాలానికల్లా మద్రాసుకొచ్చేశాను. భోంచేసి నేరుగా యిక్కడికొచ్చేశా. అప్పటికే యింత పొడవుంది క్యూ..." అంది ఆవిడ.

"సారీ ఫర్ ది ట్రబుల్ వదినా! అంతా హర్రీ బర్రీ అయిపోయింది. లేకుంటే నీకీ పని పెట్టకపోదుము..." క్యూనైపు పరకాయించి చూస్తూ అంది సుష్మ.

"ఇటీజె ప్లెజర్ సుష్మా! మా బాబీ అమెరికా ట్రిప్పుకు నేనామాత్రం కష్టపడకూడదా అమ్మాయ్..." ఆవిడ అనవసరంగా రొప్పతోంది.

"మేం మద్రాసుకొచ్చేసరికి అర్థరాత్రయిపోయింది. హోటల్లో రూం తీసుకుని కాస్సేపు రెస్ట్ తీసుకున్నాం.. తర్వాత పేపర్సన్నీ సర్దుకుని వచ్చేశాం" అంటూ తన సోదరికి వర్తమానం అందించి "డూ యూ నో సుష్మా! మన మాచ్ ఫిక్స్ కావడానికంతా మా అక్కయ్యే కారణం. అసలు నన్నెలాగైనా అమెరికాకు పంపాలని అక్కయ్య పట్టుదల..." అని బిగ్గరగా అరుస్తూ చెప్పసాగాడు బాబీ. "పీహెచ్డీ చేసి యూనివర్సిటీలో జాబ్ వచ్చినా తనెందుకింకా మారేజ్ చేసుకోలేదనుకున్నావ్? న్యాయానికి మా అక్కయ్యకు పెళ్ళికాకుండా నేను పెళ్ళిచేసుకుని వుండకూడదు. కానీ గ్రీన్‌కార్డున్నవాణ్ణి తప్ప యింకో మనిషి చాయకైనా చూడనంది. యెంతకూ సరైన మాచ్ దొరకలేదు. నేనేమో మెడిసిన్ చదివాను. నాకయితే మంచి అలయెన్స్ దొరకచ్చని యెవరో సలహా యిచ్చారట తనకి. తానే పట్టుబట్టి, పూనాలో వాళ్ళ ఫ్రెండిచ్చిన అడ్రస్సు పట్టుకుని, అమెరికాలో వున్న తెలిసినవాళ్ళ ద్వారా కదిపించి, ఫాక్స్‌లూ, కేబుల్సూ పంపించి, చివరికి మీరు యిండియాకొస్తున్నట్టు కనిపెట్టి, మాచ్ కుదిరేదాకా రెస్టులేకుండా తిరిగింది...."

"వీడు నీకసలు అసలు సంగతి చెప్పడంలేదమ్మాయ్!" ఆవిడ మరింతగా గడబిడ చేస్తూ ఆ అమ్మాయిని లాగి తన పక్కన కూచోబెట్టుకుంది. "నువ్వెళ్ళి అమ్మాయిని చూసి వోకే అంటే చాలు అంటాడు గానీ కదలడే వీడు! అమ్మాయి వాళ్ళకు గ్రీన్‌కార్డుంది. వోహియోలో సెటిలయిపోయారు. యిక ప్రత్యేకం చూడాల్సిన అవసరం లేదంటాడు. నాకు పరీక్షలున్నాయి, మీరెళ్ళి వోకే చేస్తే నేనొచ్చి మంగళసూత్రం కడతానంటాడు. వీడొట్టి అమాయకుడు. కాకపోతే గ్రీన్‌కార్డున్న పెళ్ళికూతురు దొరికాక యీ యెండీ పరీక్షలూ గట్రాయే గంగలో దూకితే యేం పోయింది చెప్పు? స్టేట్స్‌కెళ్ళాక వీడి చాయ వో కన్నేసి వుండాలమ్మాయ్ నువ్వు."

రెండు చేతులతోనూ రెండు కాఫీ కప్పులు పట్టుకుని వస్తూ "మా అక్కయ్య మాటలు కాస్త జాగ్రత్తగా వినాలి సుష్మా! నన్ను జాగ్రత్తగా చూసుకోవడమంటే నా బాధ్యతల్ని మరచిపోవద్దు అని అర్థం. అంటే యేమిటి? గ్రీన్‌కార్డున్న అమెరికా సిటిజన్ని మా అక్కయ్యకోసం వెదికిపెట్టాలి. యీజిట్ నాట్ అవర్ ఫస్ట్ డ్యూటీ..." అన్నాడు బాబీ.

కళ్ళార్పడం సైతం మరచిపోయి అక్కాతమ్ముళ్ళ నిద్దరినీ మార్చి మార్చి చూడసాగింది సుష్మ.

* * *

"ఈ అయిదారేండ్లుగా నేనెంతోమందిని పట్టి పట్టి చూసింటాను. కానీ మీ అన్నమాదిరి మనిషినెవ్వడూ చూల్లే!" అన్నారు లాయర్ రంగనాయకులు.

భగభగ మండుతున్న యెండలో డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టు భవనాల సముదాయం మిలమిలా మెరుస్తోంది. అనుమతిలేని ప్రదేశంలోకి జొరబడి రెడ్ హేండెడ్‌గా పట్టుబడిపోయిన ముద్దాయిల్లా ప్రహరీ గోడ కివతల నాలుగైదు చెట్లు తలలొంచుకుని నిల్చుని వున్నాయి. చుట్టూ యెటుచూసినా జనమే! నలుపురంగు దుస్తులు తొడుక్కున్న లాయర్లు అన్ని భవనాల్లోనూ వొకేసారి పని బడినట్టుగా గిరికీలు తిరుగుతున్నారు.

యెండను జల్లెడబెడుతున్న వెదురు తడికల క్యాంటీనులో గుంపులు గుంపులుగా కూర్చున్న వ్యక్తులు యెవరి ధోరణిలో వాళ్ళు మంతనాలు జరుపుతున్నారు.

ఉక్కపోతను సరకు చేయనట్టుగా నల్లకోటుపైన నల్లగౌను కూడా తొడుక్కుని, పొడవాటి సిగరెట్టుకు తోడుగా వేడి వేడి టీ గ్లాసును చేతబట్టుకుని "దీనికోసరం తిరపతినించీ పరిగెత్తుకొస్తివా? యాడ మేమంతా లేమా అబ్బీ!" అన్నాడు రంగనాయకులు.

తానూ టీ చప్పరిస్తూ "కేసెవ్వరు పెట్టినారు సార్?" అని అడిగాడు మద్దులేటి.

ఇప్పడిప్పడే తెల్లబారుతున్న మీసాల కొనల్లో పొటమరించిన చెమట బిందువుల్ని ముంజేయితో తుడుచుకుంటూ "పేపర్లో గూడా యేసినారు చూల్లేదా మద్దూ?" అంటూ కళ్ళజోడులోంచీ చికిలిచూపుల్ని ప్రసారం చేశాడు రంగనాయకులు.

మద్దులేటి బిక్కమొహం పెట్టాడు.

"కొత్తూరుకాడ జరిగిన అంటెంట్టు. చిన్నరెడ్డి జీపులో కడపకు పోతాండాడు. చిన్నరెడ్డి పూరిడిసిపెట్టి టవు

మకు పొయ్యేదంటే చిన్న పని గాదని తెలుసుగదా! ముందుగా ఆయిన జీపెక్కి డ్రయివరు పక్కన కూర్చున్నాడు. ఆయన పక్కన యిద్దరు గన్‌మేన్లు కుచ్చున్నారు. యెనకసీట్లో నలుగురు కుర్చున్నారు. మామూలుగా అయితే ముందొక జీపూ యెనకాలొక జీపూ ప్రొటక్షనుంటాయి. ఆ పొద్దెందుకో కొంచుం యేమరినారు. సరింగా కొత్తూరు దాంటి రెండు ఫర్లాంగులొచ్చినాంక యెంటబడింది వాళ్ల జీపు. దాంట్లో అయిదారుమంది గన్‌మేన్లుండారని డ్రయివరు కనిపెట్టేసినాడు. ఆటాక్ జేస్సేవాళ్లదే పైచెయ్యని తెల్సుకునేసినాడు. వోవర్‌స్పీడ్‌లో జీపును తోలినాడు. వాళ్ల జీపు గూడా స్పీడేస్సేసింది. చుట్టుపక్కల పల్లెల్లో వుండేటోళ్ళు గూడా రోడ్డుపైన జీపు లొకదాన్నొకటి తరుముకుంటాండేది చూసి కిల్లరకపొయినారు. వొంటిల్లుకు మైలుదూరంలో యెద్దల బండినొకదాన్ని కొట్టేసినాడు మనోడు. రెండు యెద్దుల్లో వొకటి స్పాట్ డెడ్. బండి తోలినోడింకా ఆస్పత్రిలోనే వుండాడు. వాళ్ల గన్‌మెన్లు జీపులొంచే కాల్చినారు. యెనకాల గుర్చున్నోళ్ళల్లో వొకడు స్పాట్ డెడ్. యిద్దరింకా ఆస్పత్రిలో వుండారు. యింత జరిగినా ఆ డ్రయివరు మాత్రం జీపాపినోడు గాదు. అవుంటే చిన్నరెడ్డికి డేంజరే! మిట్టూరు క్రాసుకు రాంగనే డ్రయివరు తెలివిగా అడివి మార్గానికి రూటు మార్చేసినాడు. అదే రూట్లో కడపకొచ్చినాంక చిన్నరెడ్డి పోలీసు రిపోర్టిచ్చినాడు. సరింగా ఆ మర్నాడే కడపకొస్తాండే యెగస్పార్టీవాళ్ల జీపు మింద మిట్టూరుకాడ బాంబులేసినారు. ఇద్దరు స్పాట్ డెడ్..."

"మా అన్నెప్పుడూ చిన్నరెడ్డిని నేరుగా కూడా జూసిండలే. యిగస్పార్టీవోళ్ళతో మాట్లాడిండలే! యింకెందుకు అరెస్టుచేసిండారు?"

"సమంధం లేదని మన్నమనుకుంటాండావు. జీబుమింద బాంబులేసింది నేనేనని మీ వోబులేసే వొప్పుకుంటాండాడు. దీనికీ చిన్నరెడ్డికీ సమంధం లేదని క్లియర్‌కట్‌గా చెప్తాండాడు..."

"అయితే యీయెందుకు బాంబులేసినాడంట?" మద్దులేటికంతా అయోమయంగా తోచింది.

"వాళ్ళెప్పుడో యెలక్షన్లప్పుడు వోబులేసును పావ సితగ్గొట్టినారంటలే! మీ అన్న నరయిన టయిం కోసరం నమత్సరంగా కాపెట్లుకోండావని చెప్తాండాడు..."

"పొయిన తడవ కాలేజీకి పొయ్యేటప్పుడు యిమ్నూర్రూపాయలడిగితే లేదనేసినాడు. బాంబులు దెచ్చేకి మాత్రం లెక్కెక్కడ్డించీ వస్తాది?"

"ఈ లా పాయింట్లు నాకు తెలియదనుకోవద్దు. ఈ కొచ్చిన్లన్నీ ప్రొసీడింగ్సులోనే యెగ్జామిన్ చేసేసినాను. అన్నీ సెటిలయిపొయ్యినాయి. ఈ పొద్దో రేపో జడ్జిమెంటు వచ్చేస్తాది..." రెండు అడుగులు వేసినవాడల్లే ఆగి "యిదో మద్దులేటీ! యేందో చదువుకుంటాండావనీ, జరిగిందేందో తెలవకండా వచ్చినావనీ అడిగిందానికంతా నీ కర్థమయ్యేట్టుగా వివరంగా జెప్పినాను. యేందో చూసేసి పొయ్యే దానికొచ్చినావు. గొమ్మున్నా చూసుకోని పో. ఆ మాటా యీ మాటా చెప్పి వోబులేసు మాట మార్చేట్టుగా చేసినావే అనుకో. యెంత పబ్లిక్ ప్రాసిక్యూటరయినా నేనేమీ హెల్పు జెయ్యలేను. ఆ సంగతి మర్చిపోవద్దు..."

నల్లటి బండల బెంచీపైని గ్లాసులోని టీ యెప్పుడో చల్లారిపోయింది. రంగనాయకులు ఖాళీచేసిన నలంలో నల్ల గౌను తొడుక్కున్న లాయరింకొకతను కూర్చుని పక్కన నిల్చున్న వ్యక్తితో యేదో మాట్లాడుతున్నాడు. క్యాంటీను వెలుపల బీడీలు కాల్చుకుంటున్న పోలీసులిద్దరికీ తాము యెండలో నిల్చున్నామన్న స్పృహ వున్నట్టు కనిపించడం లేదు.

కొండరాళ్ళు దొర్లించినట్టుగా పెద్దగా శబ్దంచేస్తూ మట్టిగొట్టుకుపోయిన జీబులు నాలుగు వొకదాని వెంట వొకటిగా కోర్టు ఆవరణలోకి వురకలెత్తుకొచ్చాయి. వాటిలోంచీ నలిగిన దుస్తులు తొడుక్కున్న మనుషులు కొందరు తుపాకీలు పట్టుకుని కిందికి దూకారు. కాస్సేపటి తర్వాత నింపాదిగా కిందికి దిగిన చలువ దుస్తుల మనుషులు తాపీగా కోర్టులోకి సాగిపోయారు.

మద్దులేటి ముందు కూర్చున్న లాయరు బిస్కట్టు తింటూ పక్కకు తిరిగి చూసి "చిన్నరెడ్డొచ్చినట్టుండాడు" అని మళ్ళీ తన మాటల్లో పడిపోయాడు.

తామూ పైకి లేచి కోర్టులోకి నడచాడు మద్దులేటి. వో గోడ పక్కన నడిలిపోయిన మనుషులు నలుగురైదుగురి మధ్య వోబులేసు కనిపించాడు. అతడి గడ్డం పెరిగిపోయి వుంది. తల రేగిపోయి వుంది. చేతులకు బేడీలున్నాయి.

అతడి దగ్గరకెళ్ళి నిల్చుని "మిట్టూరుదాంకా మన్నెందుకు పొయినావా పొద్దు? అంత దూరం పొయ్యే పని నీకేమొచ్చింది?" అని అడిగాడు మద్దులేటి.

వోబులేసు వులిక్కిపడి తల పైకెత్తి "కొంచెం మెల్లింగా మాట్టాడు. మన్నేందుకొచ్చినా వీడికి?" అన్నాడు కంగారుపడుతూ.

"అసలు నీ మింద రిపోర్టెవురిచ్చినారు? దాన్ని పోలీసులెట్ట నమ్మినారు? సాక్షిమెవురు చెప్పినారు?" కోపంతో మద్దులేటి గొంతు మరింత పెద్దగా వురిమింది.

వోబులేసు అటూ యిటూ పరీక్షించి చూసి, తోటి ముద్దాయిల మంచీ నాలుగడుగులు ముందుకు నడిచి "పెద్దగా అరవద్దు.. యెవురైనా యిన్నారంటే రండయిపోతింది. నీకింకా వొయిను రాలే. ఇదంతా తెలవదు.." అంటూ రహస్యం చెబుతున్నట్టుగా గొంతుక తగ్గించి చెప్పసాగాడు "మనదృష్టం బాగుంది నేనా పొద్దు మిట్టూరుకాడికి యెద్దల బేరానికి పోయున్నాను. దవుట్టుపడి పోలీసులు నా కాడి కొచ్చినారు. కేసు విచారణయిపోయినాంక కొన్ని దినాలట్ల జైల్లో కాలం దోసినామంటే పొలు, యెట్నో వొకట్ల బయటికి లాగేస్తాడు చిన్నన్న. ఆయిన నల్లంగా జూస్తే యింక భయంలే. చానా దినాలుగా రొంత నేల కొనాలని. పోరకలాడతాండాను. చిన్నన్న తలచుకుంటే బంగారట్లా నేల మనదయిపోతింది. దాంట్లో చీనీచెట్లు పెట్టేస్తే యింక దిగుల్లే! పిల్లకాయిలిద్దర్నీ ఆస్టల్లో జేర్పించి సదివిస్తాడు. వనిజేసినా చెయకపోయినా గుమస్తాలతో చెప్పి నెలనెలా టంచనుగా కూలీలెక్క యిప్పిస్తాడు. నీకేల, గొమ్మని సూస్తాండు. నీ పరిక్షలయిపోంగానే యాడైనా వుద్యోగం యెయ్యిస్తాడు. ఇట్ల మన్నొచ్చి గలాటా జేసినావని తెలిస్తే, వొద్దువొద్దన్నా నన్ను బయిటికంపించేస్తాడు. ఈ మాత్రం బేడీలేసుకోని రెండు మూడేళ్ళుజైల్లో కాలం దోసేదాంకి కొల్లబొయినంత మంది వస్తారు..."

* * *

(సశేషం)


ఆటోమేటిక్ టాయ్ రివాల్వర్



MARSHAL ZORO
Rs. 175/-
పోస్టల్ ఛార్జీలు అదనం

50 షాట్లు
ఉచితం

BULLET ZORO
Rs. 270/-
పోస్టల్ ఛార్జీలు అదనం

★ లైసెన్సు అవసరం లేదు
★ పిల్లలకు అపూర్వమైన బహుమతి
★ మహిళలకు ఆత్మ రక్షణ కొరకు

మార్షల్ జోరో మరియు బుల్లెట్ జోరో తుపాకులు మీకు పూర్తి రక్షణ నిస్తాయి. పిక్‌నిక్‌ల కొరకు, డ్రామాలలో, షూటింగ్‌లకు ప్రయాణాలలో మరియు జంతుల బారినుండి రక్షించుకొనుటకు పొగలు విరజిమ్ముతూ ప్రేలే తుపాకి వెంటనే మీ ఆర్డరులను పంపించండి.

PRAGATHI TRADERS (A/3)
(P0) MAIRA BARITH(GAYA)